ముదిరాజుల అభ్యున్నతికి కృషి

సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

అల్లాపూర్,జూన్9: రాజకీయంగా సామాజికంగా ముదిరాజుల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తున్నామని జీహెచ్ఎంసీ నగర అధ్యక్షుడు నరేంద్ర ముదిరాజ్ అన్నారు. అల్లాపూర్ డివిజన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రవీంద్ర ముదిరాజ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముదిరాజ్ సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలతో పాటు జీహెచ్ఎంసీలో జరిగే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజులకు ప్రాధాన్యత కల్పించేలా కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్యాం ముదిరాజ్, నాయకులు గోనెల సుదర్శన్ ముదిరాజ్, మూడు పూజితేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కూకట్‌పల్లి డివిజన్‌లో ప్రజా సమస్యలపై బస్తీబాట ప్రారంభం

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 9: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు బస్తీబాటతో పాదయాత్ర నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తెలిపారు. డివిజన్ పరిధిలోని కాలనీలు బస్తీలలో.. జీహెచ్ఎంసీ, జలమండలి ఆయా విభాగాల అధికారులతో కలిసి పాదయాత్రతో ప్రజలను కలవడం జరుగుతుందని, స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నేడు బస్తీ బాటలో భాగంగా అస్బెస్టాస్ కాలనీలో పాదయాత్ర ప్రారంభమవుతుందని,ప్రజలు స్థానిక సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రానున్న పది రోజులపాటు డివిజన్ పరిధిలోని కాలనీలు, బసీల్లో పర్యటించడం జరుగుతుందని, ఈ బస్తీబాటను విజయవంతం చేయాలని వెల్ఫేర్ అసోసియేషన్ నేతలను కాలనీ ప్రజలను కోరారు.

కాలనీలలో సమస్యలను పరిష్కరిస్తా

మియాపూర్, జూన్ 9: మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్సీఐ కాలనీ ప్రగతి ఎనక్లేవ్, మియాపూర్ విలేజ్‌లలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై జలమండలి అధికారులు జీఎం నారాయణ, డీజీఎం అమీరుద్దీన్, స్థానిక నాయకులు,కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎఫ్సీఐ కాలనీప్రగతి ఎనక్లేవ్, మియాపూర్ విలేజ్ కాలనీలలో అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని, పొంగుతున్న మ్యాన్‌హోల్‌ల వద్ద పునరుద్ధరణ చేస్తామని, తాగునీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పిస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్ సునీత, వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సూపర్‌వైజర్ లింగయ్య, హర్షద్, మియాపూర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు సుప్రజ, స్థానిక నాయకులు ఉమాకిషన్, రాఘవేంద్ర రెడ్డి, శ్రీనివాస్, పాండు, రాంబాబు, ఉమమహేశ్వర్‌రావు, శ్రీనివాస్, శివకుమార్, ఏబీఎన్ మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్, జూన్ 9: కుత్బుల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లోని విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హెచ్ఎంటీఎస్ఎస్ నుంచి 11kV గణేష్‌నగర్ ఫీడర్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు చెరుకుపల్లికాలనీ, కల్పన సొసైటీ, పద్మనగర్ ఫేజ్-1, ఎన్టీఆర్ కాలనీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు 11kv ద్వారకానగర్ ఫీడర్ పరిధిలో ద్వారకానగర్, డీ నగర్, ప్రసూననగర్, మాణిక్యనగర్,అంబేద్కర్‌నగర్, ఎన్ వి నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని.. ఇద్దరిపై దాడి

జీడిమెట్ల, జూన్ 9: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఒకరిని గాయపర్చగా.. ఆపేందుకు అడ్డు వచ్చిన మరొకరిని గాయపరిచాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... వరంగల్ జిల్లా నర్సాంపేట మండలం, ఇందిరానగర్ కాలనీకి చెందిన ప్రదీప్‌సింగ్‌కు పింకి అనే మహిళతో 18 ఏండ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కొడుకులు. గత 15 ఏండ్ల కిందట బతుకుదెరువు కోసం ప్రదీప్‌సింగ్ అలియాస్ విక్రమ్(34) నగరానికి వలస వచ్చి అక్కడ ఓ అమ్మాయితో కలిసి ఎస్పీఏ బిజినెస్ చేస్తున్నాడు. అంతే కాకుండా ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భార్య పింకి ఎన్నిసార్లు వద్దు అని చెప్పినా వినలేదు. అయితే సోమవారం ఉదయం తన భర్త ప్రదీప్‌సింగ్ ఫోన్‌తో కాల్ చేసి షాపూర్నగర్‌లోని రామ్‌సాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలుపగా.. వెంటనే బయలుదేరి అక్కడికి చేరుకుని వచ్చి చూడగా.. తన భర్తతోపాటు ఉంటున్న సిరాజ్‌సింగ్ అలియాస్ వినయ్‌ల తలకు, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స పొందుతూ ఐసీయూలో ఉన్నారు. పింకి తన భర్త దగ్గరకు వెళ్లి వివరాలు అడుగగా.. అప్పట్లో ఓ అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకుని వదిలేశానని, ఆ విషయాన్ని ఆ అమ్మాయి భర్త వెంకటరమణకు తెలిసి ఆదివారం ఆ అమ్మాయి పుట్టినరోజు అని సంజయ్ గాంధీనగర్లో ఉంటున్న తన గదిలో పార్టీ ఉందని రమ్మని పిలిచారు. తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకుంటావా? అని వెంకటరమణ తనను చంపేయాలని పక్కన ఉన్న మేకులు కొట్టే సుత్తితో తలపై కొట్టాడు. తలకు బలమైన గాయమైంది. ఆపడానికి వచ్చిన సిరాజ్‌సింగ్‌ని కూడ తలపై కొట్టగా అతనికి కూడా గాయమైంది. గాయపరిచిన వెంకటరమణ, అతనికి సహకరించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రదీప్‌సింగ్ భార్య పింకి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- లేకుంటే జీహెచ్ఎంసీ కార్యాలయానికి తాళం వేస్తాం
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హస్మత్‌పేట చెరువుకట్ట వద్ద జరుగుతున్న రిటైనింగ్‌వాల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ నరసింహ యాదవ్, ఇతర అధికారులు

బాలానగర్, జూన్ 9 : అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా ఉంటే జీహెచ్ఎంసీ కార్యాలయానికి తాళం వేయక తప్పదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. సోమవారం ఓల్డ్‌బోయిన్పల్లి డివిజన్లో అన్ని విభాగాల అధికారులు, డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్‌తో కలిసి ఆయన అస్మత్పేట బోయిన్ చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. చెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. రెండేండ్ల కిందట రూ.17కోట్ల నిధులు కేటాయించి సుందరీకరణ పనులు చేపడితే ఇప్పటికీ పూర్తి చేయకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చెరువులో ఎప్పటికప్పుడు గుర్రపుడెక్క తొలగించే విధంగా చర్యలు చేపట్టే వారమని, ప్రస్తుతం అలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయగా.. కట్టపై వాహనాల పార్కింగ్ చేయడం ఎంత వరకు సమంజసం అని, సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని వాహనాలను తొలగించే ప్రయత్నం ఎందుకు చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. డీసెల్టింగ్ వ్యర్థాలను తీసుకువచ్చి చెరువు కట్టపై డంపింగ్ చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం మల్లికార్జున కాలనీలోని కార్పొరేటర్ నరసింహ యాదవ్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఆయనతో పాటు అన్ని విభాగాల అధికారులు కాలనీ సంఘాల ప్రతినిధులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఐఎల్ కాలనీ, ఆర్ఆర్‌నగర్, జాగృతి ఫైన్ టీచర్స్ కాలనీ కోయబస్తీ రాజరాజేశ్వరి టౌన్షిప్ పీవీ ఎన్క్లేవ్ మైత్రివనం కాలనీ పార్క్ విల్లాలకు చెందిన కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో అత్యధికంగా డ్రైనేజీ సమస్యలు, వీధిలైట్లు వెలగడంలేదని, రోడ్లు వేయాలని, రోడ్డుపై వరద నీరు నిలుస్తుందని, ఓపెన్ జిమ్‌కు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తులు చేశారు. కాలనీవాసుల నుంచి వచ్చిన వినతి పత్రాలను సంబంధిత అధికారులకు ఆయన అందజేశారు. తక్షణమే ఆయా పనులను చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నెలకు 30 కోట్ల నిధులు కేటాయింపు చేసుకొని అనేక అభివృద్ధి పనులు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం నెలకు 65 లక్షల మాత్రమే కేటాయించడంతో ఏం పనులు చేపడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు జీహెచ్ఎంసీకి ప్రాపర్టీ టాక్స్‌లు కడుతున్నారు. అలాంటప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో జీహెచ్ఎంసీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ అధికారులు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోతే కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పేదల ఇండ్లను కూల్చడంలో ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని విమర్శించారు. జలమండలి, జిహెచ్ఎంసి, శానిటేషన్, హెల్త్ డిపార్ట్మెంట్, అధికారులు సమగ్రంగా పనిచేయడం లేదని దీనిని ప్రజలందరూ గమనిస్తున్నారని అధికారులు ప్రజాగ్రహానికి గురి కాకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు పనులపై చిత్తశుద్ధి ఉండాలని అధికారులకు సూచించారు.

మాదాపూర్‌లో వరద కట్టడికి చర్యలు

దుర్గంచెరువు తూముని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

కొండాపూర్, జూన్ 9 : మాదాపూర్‌లోని వరద ముప్పు ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలాల్లో వరద ప్రవాహాలకు ఆటంకాలను ఆయన పరిశీలించారు. వర్షం పడితే నీట మునుగుతున్న నెక్టార్ గార్డెన్స్ పరిసరాలలో వర్షపు నీరు నిల్వకుండా తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, జలమండలి అధికారులతో చర్చించారు. వర్షం పడితే నడుము లోతు నీళ్లు తమ కాలనీలో నిలబడుతున్నాయని స్థానికులు కమిషనర్‌కు విన్నవించారు. దుర్గంచెరువుకు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో ఎంతనే అంశాలను చెరువు చుట్టూ తిరిగి పరిశీలించారు. చెరువు లోపల తూములను, గేట్లు, ఏ గేటు ఎత్తితే ఎంత నీరు వెళ్తుందనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో దుర్గంచెరువుపై సమీక్షను ఇరిగేషన్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు ఉద్యమించాలి

మియాపూర్, జూన్ 9: అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు మియాపూర్ ఎంఏనగర్ ఆఫీసులో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు ప్రారంభ ఉపన్యాసకులుగా జస్టిస్ చంద్రకుమార్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ తన రెండోసారి ప్రభుత్వం ఏర్పడిన కాలంలోనే మోదీ విద్యారంగంలో కేంద్రీకరణ కార్పొరేటీకరణ, కషాయీకరణను వేగవంతం చేయడానికి నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి అందులో భాగంగా ఈ మధ్యకాలంలో ఎన్‌టీఏ లాంటి కేంద్రీకృత విధానాలకు ఆమోదముద్ర వేసి పేపర్ లీకేజీ కావడం, అమ్ముకోవడానికి ప్రోత్సహించడం వలన నీట్ పరీక్ష రాసిన 24 లక్షలకు పైగా విద్యార్థులకు అన్యాయం చేశారన్నారు. నూతన జాతీయ విద్యా విధానంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విధానం లేదని, ప్రజాపాలన పేరుతో గద్దెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత విధానాన్ని కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రంలో విద్యార్థి నిరుద్యోగ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని జస్టిస్ చంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఈ శిక్ష తరగతులకు ప్రిన్సిపాల్‌గా ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు టింకటి కుమార్ హైదరాబాద్ కన్వీనర్ శ్రీకాంత్ మార్త నాగరాజ్ పోలబోయిన రాజు, సాయిరాం రెడ్డి జవాజి శ్రీజిత్, అరుణ్ వేణు తదితరు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్ర కుమార్

'ప్రజావాణి'కి ఫిర్యాదుల వెల్లువ

కూకట్‌పల్లిజోన్ ఆఫీస్‌లో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెడ్సీ అపూర్వ చౌహాన్

ప్రజావాణి కార్యక్రమంలో అధికారులతో మాట్లాడుతున్న ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 9: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 11 ఫిర్యాదులు వచ్చినట్లు జెడ్సీ అపూర్వ చౌహాన్ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి 5, టౌన్ ప్లానింగ్ విభాగానికి 5, అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి ఒక ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. అలాగే కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గంగాధర్ తెలిపారు. మూసాపేట సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 4 ఫిర్యాదులు వచ్చాయని, టౌన్ ప్లానింగ్ విభాగానికి 2, శానిటేషన్ విభాగానికి 1, ఎలక్ట్రికల్ విభాగానికి1 ఫిర్యాదు వచ్చినట్లు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. ఈ ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

మియాపూర్‌లో...

మియాపూర్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులపై తక్షణ చర్యలు తీసుకోవాలని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వీటిని ఈ నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి ప్రజలు వినతులను అందజేశారు అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు అందించే వినతులను విధిగా రికార్డులలో నమోదు చేయాలని, నిర్ధారిత గడువులోగా పరిష్కరించి తిరిగి వారికి సమాచారం అందించాలని స్పష్టం చేశారు. సంబంధిత విభాగాల అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలో తగు పరిశీలనను పూర్తి చేసి చర్యలను వేగవంతం చేయాలని ఉప కమిషనర్ మోహన్ రెడ్డి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏసిపి నాగిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ రవి ,తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో...

కుత్బుల్లాపూర్:కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజలు పలు సమస్యలపై ఫిర్యాదులు చేశారు. పది ఫిర్యాదులు అందగా..వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు డీసీలు నరసింహ, మల్లారెడ్డి ఆదేశించారు.

గురుకుల్ విద్యాలయానికి పూర్వ వైభవం కల్పించాలి

ఘట్‌కేసర్ పోస్టాఫీసులో ఉత్తరాలను పోస్టు చేస్తున్న సురేష్ తదితరులు

ఘట్‌కేసర్, జూన్ 9: వేలాదిమందికి విద్యానందించి ఉత్తములుగా తీర్చిదిద్దిన గురుకుల్ విద్యాలయానికి ప్రభుత్వం పూర్వ వైభవం కల్పించాలని కోరుతూ పట్టణ యువత ముఖ్యమంత్రి, మంత్రులకు ఉత్తరాలను పోస్ట్ చేస్తున్నారు. గురుకుల్‌విద్యాలయానికి పూర్వ వైభవం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఘట్ కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ చేపట్టిన ఉత్తరాల ఉద్యమంలో భాగంగా పట్టణానికి చెందిన యువతీ యువకులు, మహిళలు, పూర్వ విద్యార్థులు, విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తూ సోమవారం ఉత్తరాలను పోస్ట్ చేస్తున్నారు. అందులో భాగంగా జనచైతన్య సేవా సమితి ప్రచారకర్త శివరాత్రి సురేష్ ఆధ్వర్యంలో పలువురు సోమవారం ఉత్తరాలను పోస్ట్ చేశారు.

దూరవిద్య ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంబీఏ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ మొదటి, మూడు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కుత్బుల్లాపూర్, జూన్ 9: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గత నెల 15న గున్న పోచంపల్లి గ్రామ సమీపంలో సుమారు వృద్ధుడు(70) స్పృహ తప్పి పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి ఆ వృద్ధుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసినవారు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

అర్ధరాత్రి ఫోన్ మాట్లాడొద్దన్న తల్లిదండ్రులు..కూతురు ఆత్మహత్య

తేజస్విని(ఫైల్)

కుత్బుల్లాపూర్, జూన్ 9: నిత్యం కూతురు రాత్రి సమయంలో ఫోన్ మాట్లాడుతుందని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన ఇంటర్మీడియట్ చదివే కుమార్తె ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం...సుభాష్‌నగర్ డివిజన్ లాస్ట్ బస్‌స్టాప్ ప్రాంతానికి చెందిన రాకేష్‌కుమార్ దంపతులకుకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె పెండ్లి చేయగా.. చిన్న కూతురు తేజస్విని(19) ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్నది. దంపతులిద్దరూ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈనెల 8వ తేదీన తేజస్విని రాత్రి 11 గంటల సమయంలో ఫోన్ మాట్లాడుతుండగా.. ఎవరితోటి మాట్లాడుతున్నావు అంటూ మందలించారు. కాగా, ఉదయం తల్లిదండ్రులు ఎవరి పనులకు వారు వెళ్లగా ఇంట్లో ఉరేసుకొని మృతి చెందింది. పక్కింటి వాళ్లు గమనించి విషయాన్ని తండ్రికి చెప్పి స్థానికుల సాయంతో తేజస్విని స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి రాకేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన జపాన్ బృందం

జపాన్ ప్రతినిధుల బృందంతో హెచ్‌సీయూ వీసీ బీజే రావు

కొండాపూర్, జూన్ 9 : గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని సోమవారం జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ(జేఎస్‌టీ) ప్రతినిధుల బృందం సందర్శించింది. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బీజే.రావు జపాన్ బృందానికి ఘన స్వాగతం పలికి, వర్సిటీలోని పరిశోధన, అకాడమిక్ విశిష్టతలను వివరించారు. భారత్ – జపాన్ల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జేఎస్టీ –హెచ్‌సీయూల కలయికతో క్యాన్సర్, మూత్రపిండ వ్యాధులు, అధిక ఫ్రీక్వెన్సీ పదార్థాలు, లిథియం–అయాన్ బ్యాటరీలు, నానో జనరేటివ్ వ్యాధులు వంటి కొన్ని రంగాల్లో మెరుగైన పరిశోధనలను కొనసాగించనున్నట్లు తెలిపారు. జపాన్ ప్రతినిధుల బృందానికి టీ కొనిషి, యూజీ నిషికోవాలు ప్రతినిత్యం వహించారు.

ఓల్డ్ బోయినపల్లి సమగ్ర అభివృద్ధికి కృషి

ఓల్డ్ బోయినపల్లి డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని తిరుమల అపార్ట్మెంట్, చాముండేశ్వరి అపార్ట్మెంట్‌లలో అపార్ట్మెంట్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా అసోసియేషన్ సభ్యులతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా అపార్ట్మెంట్ల పరిధిలో వీధి లైట్లు వేయాలని స్పీకర్స్ వేయాలని ట్రీ కటింగ్ చేయాలని శానిటేషన్ సక్రమంగా చేయడం లేదని ఆయనకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. కాలనీలు, బస్తీలు, అపార్ట్మెంట్ పరిసరాలు అన్నిటిలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి సేవలందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అపార్ట్మెంట్ల ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– బాలానగర్, జూన్ 9

టీబీ నిర్మూలనకు వైద్య పరీక్షలు

మియాపూర్, జూన్ 9: టీబీ ముక్తిభారత్ అభియాన్ కార్యకమంలో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎల్లమ్మబండలో టీబీ వ్యాధిగ్రస్తులను ఏఐ ఎక్సేయంత్రంతో గుర్తింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కీలకమైన ఆరోగ్య అధికారులు, సమాజ కార్యకర్తల తోడ్పాటుతో టీబీ నిర్మూలనకు ప్రభుత్వపరంగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి, డాక్టర్ విజయచంద్ర, మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్ మోహన్ పాల్గొనారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 9: కూకట్‌పల్లి(కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 23, వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 25, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజి 15, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 28, దొండ 23, చిక్కుడు 65, గోరు చిక్కుడు 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 61, ఆలుగడ్డ 24, కీరా 23, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 18, కందగడ్డ 45, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 22, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 33, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

వీవీ ప్యాడ్ గోదాం పరిశీలన

వీవీ ప్యాడ్‌ల గోదాంను తనిఖీ చేసిన చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ గౌతమ్, వివిధ పార్టీల నాయకులు

మేడ్చల్, జూన్ 9: జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న వీవీ ప్యాడ్ గోదాంను సోమవారం చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి,జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఈవో, జిల్లా ఎన్నికల అధికారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధు ల సమక్షంలో వేర్‌హౌజ్ సీల్ తెరిచి గోడౌన్‌లోని ఈవీఎం, వీవీ ప్యాడ్‌లు భద్రపరిచిన పెట్టెలను పరిశీలించారు. వీవీ ప్యాడ్‌లకు సంబంధించిన భద్రత వివరాలను జిల్లా ఎన్నికల అధికారి సీఈవో కు వివరించారు. తనిఖీ అనంతరం అందరి సమక్షంలో గోదాం తా ళం వేసి సీల్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, డీఆర్వో హరిప్రియ, శామీర్ పేట తహసిల్దార్ యాదగిరిరెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి,జూన్ 7: ప్రజలకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ. కర్ణన్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఆనందబాగ్,విష్ణుపురి కాలని, ఓల్డ్ నేరెడిమేట్,ఓల్డ్ మల్కాజిగిరి, ఆర్కే నగర్ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


హరీశ్‌కుమార్ (ఫైల్)

శామీర్‌పేట, జూన్ 9: వ్యక్తి అదృశ్యమైన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకా రం వివరాలు... కడప జిల్లా కొండాపురంకు చెందిన కంచిమరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి తమ్ముడు హరీశ్‌కుమార్‌రెడ్డి(32) తూంకుంట మున్సిపల్‌లో భార్యతో నివసిస్తూ కర్కపట్లలోని ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు. ఈనెల 8న ఇంటినుంచి బయటకి వెళ్లిన ఆయన రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆయన కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అదృశ్యమైన హరీష్‌కుమార్‌రెడ్డి దాదాపు 5–6 అంగుళాల ఎత్తు, చామకనచాయ, వంటిపై పచ్చటి టీషర్ట్, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, తెలుగు, హుందీ, ఇంగ్లిష్ భాష ల్లో మాట్లాడుతాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు 8712554144, 9490617142 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.